
## రేపటిలోగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి..

- ఉపాధి పనులను పెంచేలా చర్యలు తీసుకోవాలి..
- సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, జనవరి 18 : నిర్మల్ జిల్లాలోని 396 గ్రామ పంచాయతీ(జీపీ)ల అభివృద్ధి ప్రణాళికలను గ్రామసభల్లో తీర్మానాలు చేసి రేపటి(శనివారం)లోగా రూపొందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు పెంచేలా చర్యలు తీసుకోవాలని, కూలీలకు పని కల్పించాలని సూచించారు. 2024-25 సంవత్సరానికి గాను మండల, గ్రామస్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. హరితహారంలో మొక్కల రక్షణ, పారిశుధ్య నిర్వహణ, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, డీఆర్‌డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 18 : స్వర్గీయ నందమూరి తారక రామారావు(ఎన్‌టీఆర్) 28వ వర్ధంతిని పురస్కరించుకుని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. రాజకీయాల్లో చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు రమణ, రాజు, పోశెట్టి పాల్గొన్నారు.

# అడవుల్లో బతుకే పోరాటం

## పులుల సంఖ్య పెరగడంతో ఆదివాసుల అవస్థలు

- పశువులపై పెరుగుతున్న దాడులతో అయోమయం
- అడవిని వదల్లేక.. ఎంత కష్టమొచ్చినా భరిస్తూ..
- ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడితే మంచిది..


ఇటీవల మృతిచెందిన పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు (ఫైల్)


పులిదాడిలో మృతి చెందిన రైతు సిడాం భీం(ఫైల్)


పులిదాడిలో మృతిచెందిన పశువు వద్ద రైతు(ఫైల్)

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ), జనవరి 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో నిశ్శబ్ద బతుకుపోరాటం సాగుతున్నది. పుట్టింది మొదలు గిట్టే వరకు అడవినే నమ్ముకుని బతుకుతున్న ఆదివాసులు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ కారిడార్‌లో పదేళ్లుగా పులుల సంతతి బాగా పెరిగింది. ఒకప్పుడు ఒకటి, రెండు పులులు మహారాష్ట్ర, ఇంద్రావతి, ప్రాణహిత, తడోబా నుంచి మన జిల్లా అడవుల్లోకి వచ్చి వెళ్లేవి. కానీ.. ఇటీవలి కాలంలో కాగజ్‌నగర్ పులుల ఆవాసంగా మారింది. ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకుంటున్నాయి. ఈ క్రమంలోనే గడిచిన మూడేళ్లలో ఆదివాసులు, పశువులపై పులుల దాడులు పెరిగాయి. ముగ్గురు ఆదివాసులు చనిపోగా.. వందలాది పశువులు పులుల ఆకలికి బలైపోయాయి. ప్రపంచానికి దూరంగా అడవుల్లో ఉంటున్న ఆదివాసులు.. ఇప్పుడు బతుకు పోరాటం చేయాల్సి వస్తున్నది. అధికారుల నిర్లక్ష్యం, ఆదివాసులు అంటే చిన్నచూపుతో పులులపై దాడులు చేసే వరకు వెళ్లిందనడంలో సందేహం లేదు. తాజాగా కాగజ్‌నగర్ డివిజన్‌లో విషప్రయోగం చేసి పులులను హతమార్చడం ఉదాహరణగా నిలుస్తున్నది.

### ప్రతి దాడులకు కారణం అదేనా..

పులి దాడిలో మనుషులు చనిపోతే రూ.5 లక్షలు.. పశువులు(ఆవులు,ఎడ్లు) చనిపోతే రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు నష్ట పరిహారం చెల్లించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పులులు చనిపోతే స్పందిస్తున్న జాతీయస్థాయి స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధికారులు.. అదే పులుల దాడుల్లో ఆదివాసులు, పశువులు చనిపోయినప్పుడు పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాల్సిన అధికారులు ఇబ్బందులకు గురిచేసినపుడు ఆదివాసుల్లో నైరాశ్యం పెరిగి పులులపై ప్రతి దాడి చేసే వరకు వెళ్తున్నది. రెండు పులుల మృతి వెనుక ఉన్న కారణం ఇదే కావడం గమనార్హం. పశువును పులి చంపిందన్న కోపంతో విషప్రయోగం చేసినట్లు నిందితులు విచారణలో చెప్పడం కలకలం రేపింది. కానీ.. అధికారులు ఎప్పటి మాదిరిగానే ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.

### ఇవీ ఘటనలు.. అధికారుల దగ్గర లేని లెక్కలు..

- అడవుల్లో పెరిగిన పులుల సంతతితో ఆదివాసుల జీవనం కష్టంగా మారింది. మేత కోసం అడవులకు వెళ్లిన పశువుల మీద పులులు దాడులు చేసిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. వారంలో కనీసం రెండు పశువులు మృతి చెందుతున్నాయి.
- నవంబర్ 11, 2020న దహెగాం మండలంలోని దిగిడ గ్రామానికి చెందిన విఘ్నేష్‌పై పులి దాడి చేసి చంపింది.
- నవంబర్ 29, 2020న పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన నిర్మలపై పులి దాడి చేసి పొట్టన పెట్టుకున్నది.
- 2022 నవంబర్‌లోనూ ఒక రైతును పులి బలిగొంది.
- 2024 జనవరిలో కూడా పశువుల మందతోపాటు పశువుల కాపరిపైనా పులి దాడి చేసింది. అదృష్టవశాత్తు ఆయనకు ఏం కాలేదు.
- 2021 సంవత్సరంలోనే దాదాపు 122 పశువులు చనిపోయాయి.
- గడిచిన నాలుగేళ్లలో పులి దాడిలో చనిపోయిన, గాయపడిన పశువుల సంఖ్య వందల్లోనే ఉంటుంది. కానీ.. ఆ వివరాలు అధికారుల దగ్గర లేకపోవడం గమనార్హం.
- ఇప్పటివరకు 70 నుంచి 80 పశువులకు మాత్రమే రూ.12 లక్షల నష్ట పరిహారం అందించారు. ముగ్గురు చనిపోగా వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షలు ఇచ్చారు.
- పులుల దాడుల్లో చనిపోయిన మేకలు, గొర్రెలకు పరిహారం ఇవ్వడం లేదు.
- అదే పక్కనున్న మహారాష్ట్రలో పులుల దాడుల్లో మనుషులు చనిపోతే రూ.15 లక్షల పరిహారం ఇస్తున్నారు.

### ఏం చేస్తే బాగుంటుంది..

- అడవుల్లో పులులతోపాటు ఆదివాసుల రక్షణకు కూడా సమప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- పులులు ఆహారంగా తీసుకునే వన్యప్రాణుల సంతతిని పెంచాలి. గడ్డి మైదానాలను కూడా అభివృద్ధి చేయాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫలితంగా పాడి పశువులపై దాడి చేయకుండా ఉంటాయి.
- నిర్మల్ జిల్లాలోని జన్నారం మండల పరిధిలో గల అడవుల్లోని గూడేలు, తండాలు, గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి ప్రత్యామ్నాయ చర్యలను కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్ డివిజన్లలో కనిపించడం లేదు.
- అధికారులు తీరు మార్చుకోకపోతే పులుల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది.
- ఆదివాసులు కూడా పులులు దాడి చేసినప్పుడు క్షణికావేశానికి గురికాకుండా, న్యాయమైన పద్ధతిలో పరిహారం కోసం సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.
- త్వరలో మహారాష్ట్ర అటవీశాఖ అధికారులతో సమావేశమై పులుల రక్షణకు అక్కడ తీసుకుంటున్న చర్యలు, మనం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు అధికారులు చెప్తున్నారు. అవి ఎంత వరకు కార్యరూపం దాలుస్తాయో వేచి చూడాలి.


బహుమతులు ప్రదానం చేస్తున్న డీడీ, అధికారులు


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

## హోరా హోరీ

- ఉట్నూర్‌లో కొనసాగుతున్న ఐఎస్‌ఎల్ క్రీడలు
- వివిధ పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

ఉట్నూర్, జనవరి 18 : ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న గురుకులాల ఐఎస్‌ఎల్ రాష్ట్రస్థాయి పోటీలు గురువారం కూడా కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. అలాగే పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్ పోటీలు కూడా నిర్వహించారు. కాగా.. 100 మీటర్ల పరుగు పందెంలో రాథోడ్ కార్తీక్‌కు గోల్డ్, రాథోడ్ విక్రంకు సిల్వర్.. 600 మీటర్ల విభాగంలో కొడప పరశురాంకు గోల్డ్, ప్రవీణ్‌కు సిల్వర్.. షాట్‌పుట్ విభాగంలో చరణ్‌కు గోల్డ్, మర్సుకోల ఇందూర్‌షావ్‌కు సిల్వర్ మెడల్స్ లభించాయి. 100 మీటర్ల విభాగంలో శివప్రసాద్‌కు గోల్డ్, రాజేశ్‌కు సిల్వర్.. 800 మీటర్లలో బసంత్ ముత్కల్ విద్యార్థికి గోల్డ్, సంతోష్‌కు సిల్వర్ మోడల్స్ దక్కాయి. హైజంప్‌లో మడావి సోము గోల్డ్, మురళీకృష్ణకు సిల్వర్.. డిస్కస్ త్రో విభాగంలో పవన్‌కుమార్‌కు గోల్డ్, గౌతమ్‌కు సిల్వర్.. హైజంప్ విభాగంలో జాదవ్ శ్రీకాంత్‌కు గోల్డ్, హరిప్రసాద్‌కు సిల్వర్.. లాంగ్ జంప్ విభాగంలో వెంకటేశ్వర్‌రావుకు గోల్డ్, చరణ్‌కుమార్‌కు సిల్వర్ మెడల్స్ వచ్చాయని అధికారులు తెలిపారు. వీరికి డీడీ దిలీప్ కుమార్ బృందం మెడల్స్, పత్రాలు బహూకరించారు.


కబడ్డీ ఆడుతూ..

## పత్తి ధర ఢమాల్

### కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ నిర్వాకంతో తగ్గిన దూది ధర

- ఇప్పటికే ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర తగ్గించి కొనుగోలు
- నాణ్యత పేరిట రూ.50 తగ్గించాలని మార్కెటింగ్ శాఖకు సీసీఐ ఆదేశాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి వాహనాలు

ఆదిలాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అహర్నిశలు కష్టపడి సాగు చేసిన పత్తిని తక్కువ ధరకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఈ యేడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.7,020 ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తిని కొనుగోలు చేయాలి. గతేడాది అక్టోబర్ నెల చివరి వారంలో కొనుగోళ్లను పారంభించగా.. పది మార్కెట్ యార్డుల్లో ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కాగా.. సీసీఐతోపాటు ప్రైవేటు వ్యాపారులు కూడా పత్తిని కొనుగోలు చేశారు. ప్రైవేటు వ్యాపారులు మద్దత ధర కంటే క్వింటాలుకు రూ.300 తక్కువగా కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన 'హిట్ అండ్ రన్' చట్టానికి వ్యతిరేకంగా ట్రక్ ఆపరేటర్లు సమ్మెకు దిగడంతో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదు. దీంతో రైతులు పంటను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నారు.

### మద్దతు ధర కంటే రూ.50 తక్కువ

ఇప్పటి వరకు 12 లక్షల క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరుగగా.. సీసీఐ ఆధ్వర్యంలో 8.55 లక్షలు, ప్రైవేటు వ్యాపారులు 3.45 లక్షల క్వింటాళ్లను సేకరించారు. రైతుల నుంచి పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాల్సిన సీసీఐ అర్ధాంతరంగా ధరను తగ్గించింది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 ఉండగా, పంట నాణ్యత పేరిట సీసీఐ రూ.50 తగ్గించి రూ.6,970తో కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటన జారీ చేశారు. తగ్గించిన ధర సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నదని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. చాలా మంది రైతులు ధర పెరుగుతున్నదనే ఆశతో పంటను అమ్ముకోకుండా నిల్వ చేసుకున్నారు. కొందరు పత్తి పంటను ఏరలేదు. ధర తగ్గించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ నిర్వాకంతో మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకున్నదని వాపోతున్నారు. సీసీఐ ధర తగ్గించడంతో ఇప్పటికే మద్దతు ధర కంటే రూ.300 తక్కువకు కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు.. ఇంకా ధర తగ్గించే ప్రమాదం ఉంది. సీసీఐ, ప్రైవేటు వ్యాపారుల కారణంగా పత్తి రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకున్నది.



అయోధ్యకు తరలిస్తున్న భారీ లడ్డు

## అయోధ్యకు 1,265 కిలోల లడ్డు

నిర్మల్ అర్బన్/ఆదిలాబాద్ రూరల్, జనవరి 18 :అయోధ్యలో శ్రీబాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా హైదరాబాద్ నుంచి అయోధ్యకు 1,265 కిలోల భారీ లడ్డును ప్రత్యేక వాహనంలో తరలిస్తున్నారు. శ్రీరామ భక్తుడు ఎన్.నాగభూషణంరెడ్డి తయారు చేసిన ఈ లడ్డు నిర్మల్ మీదుగా ఆదిలాబాద్‌కు గురువారం ఉదయం చేరుకుంది. దీనిని ప్రజల సందర్శనార్థం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఉంచారు. అనంతరం మధ్యాహ్నం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మీదుగా అయోధ్యకు తీసుకెళ్లారు. కాగా.. ఎన్.నాగభూషణం రెడ్డిని పలుకరించగా.. అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని నాలుగేండ్ల క్రితం మొదలు పెట్టారని తెలిపాడు. మొదలు పెట్టిన రోజు నుంచి రోజుకు ఒక కిలో చొప్పున లడ్డు తయారు చేసి, దీనితోనే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన వరకు 1,265 కిలోలతో భారీ లడ్డును తయారు చేసినట్టు తెలిపాడు. ఈ లడ్డునే అయోధ్యకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నాడు.

## అత్యాచారం కేసులో 20 ఏండ్ల జైలు

నిర్మల్ అర్బన్, జనవరి 18 : బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్షను విధిస్తూ గురువారం తీర్పును వెల్లడించినట్లు లైజన్ అధికారి సక్రియా నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని భోకర్ తాలూకాకు చెందిన కడె అలియాస్ బాలు నిర్మల్ జిల్లా భైంసా రూరల్ మండలంలోని ఓ గ్రామంలో బర్ల కాపరిగా పనికి కుదిరాడు. అతని యజమాని రేకుల షెడ్డులోనే కుటుంబ సభ్యులతో కలిసి జీవించేవాడు. తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మారుతి కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి సదరు యజమాని చేనులోనే రేకుల షెడ్డులో వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మారుతి తన కూతురును అతని సోదరి అనుసాబాయి ఏప్రిల్ 17, 2018 రోజున పండుగ నిమిత్తం జౌవ్‌లా గ్రామానికి తీసుకెళ్లి మరుసటి రోజు తీసుకొచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికను బాలు ఎత్తుకెళ్లి లైంగికదాడి చేసి పారిపోయాడు. ఇంటి ఎదుట ఏడ్చుకుంటూ కూర్చున్న బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. తండ్రి మారుతి భైంసా రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు గురువారం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు, స్పెషల్ పీపీ విశ్వాస్‌రెడ్డి 18 మంది సాక్షులను కోర్టులో హాజరు పర్చారు. నేరం రుజువు కావడంతో నిర్మల్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు ప్రధాన ప్రత్యేక న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడు బాలుకు 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు.

## ఘనంగా నిర్వహిద్దాం..

### గణతంత్ర వేడుకలపై అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్ష

నిర్మల్ టౌన్, జనవరి 18 : ఈనెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్యం, విద్యుత్, ఉద్యానవనం శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకుమారి, డీఆర్వో లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న జనం

## ఆర్టీసీ 'చేతు'లెత్తేసింది..

### బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికుల ఉక్కిరిబిక్కిరి

నిర్మల్ టౌన్, జనవరి 18 : కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. రెండు రోజులుగా ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో నిర్మల్ బస్టాండ్‌లో రద్దీ పెరిగింది. ప్రధానంగా.. నిర్మల్ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖానాపూర్ రూట్లలో వెళ్లే వారికి బస్సుల కొరత అధికంగా ఉంది. అటువైపు వెళ్లే బస్సులు వస్తే సీట్ల కోసం కుస్తీ పడుతున్నారు. కిటికీల నుంచి దూరి లోపలికి వెళ్తున్నారు. దీంతో పిల్లలు, వృద్ధులు, బాలింతలు, దివ్యాంగులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్టీసీ సిబ్బంది బస్సుల కొరత తీర్చలేక చేతులెత్తేస్తున్నారు.





కిటికీలో నుంచి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు